క్లుప్తంగా

వేడుకగా దుర్గామల్లేశ్వరి స్వామి ఊరేగింపు



కనకదుర్గా మల్లేశ్వరి స్వామి, అమ్మవార్ల పల్లకి ఊరేగింపు

నర్సీపట్నం: పట్టణంలోని కనకదుర్గ మల్లేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామి అమ్మవార్లను శనివారం పల్లకిలో ఊరేగించారు. పట్టణ పురవీధుల్లో ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నర్సీపట్నం: డివిజన్ పరిధిలోని పాయకరావుపేట 132 కె.వి.సబ్ స్టేషన్, పెద్దాపురం 132 లైన్లో మరమ్మతులు నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. పెదబొడ్డేపల్లి, గబ్బాడ, బలిఘట్టం, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల, పాములవాక, నాతవరం, గొలుగొండ, కస్నూరుపాలెం, ఏటిగైరంపేట, కేడీపేట 33/11 సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు (3 ఫేస్) సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

సీనియర్ సిటిజన్స్, పెన్షనర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు కుమార్‌బాబు

నర్సీపట్నం: సీనియర్ సిటిజన్స్, పెన్షనర్ల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చింతకాయల సన్యాసిపాత్రుడు, అధ్యక్షుడిగా జి.కె.ఆర్.కుమార్‌బాబు ఎన్నికయ్యారు. సంఘం వ్యవస్థాపకుడు సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఇక్కడ మినీ లైబ్రరీ ఏర్పాటుతో పాటు పొదుపు ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవాలని నిర్ణయించారు. గౌరవాధ్యక్షుడు సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ సంఘం ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అందరూ సమష్టిగా పని చేసి సంఘాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు.

టీడీపీ మాజీ వైస్ ఎంపీపీకి పింఛన్ అందజేత



మాజీ వైస్ ఎంపీపీకి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటర్ వరలక్ష్మి

నర్సీపట్నం: ధర్మసాగరం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ నిద్ర అప్పలరాజు అనారోగ్యంతో విశాఖలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ సామిరెడ్డి వరలక్ష్మి మానవతా దృక్పథంతో శనివారం అక్కడకు వెళ్లి పింఛన్ నగదు అందజేసి ప్రశంసలందుకుంది.

క్రీడా మైదానానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూలు ఆవరణలో క్రీడా మైదానం నిర్మాణానికి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ శనివారం శంకుస్థాపన చేశారు. దీని అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరైనట్లు హెచ్ఎం ముత్యాలునాయుడు తెలిపారు. ఎంపీడీవో కాశీప్రసాదు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి పాల్గొన్నారు.

సామాజిక సేవ.. అభివృద్ధికి తోవ

- 5 గ్రామాల్లో పూర్తయిన 12 అభివృద్ధి పనులు
- రూ.35.58 లక్షలు వెచ్చించిన విశాఖ డెయిరీ
- నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బూడి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్



మంచాల వద్ద కోనాం హైలెవల్ కాలువపై నిర్మించిన కల్వర్టు



జైతవరం గ్రామం నుంచి జాగవరపు వారి కళ్లాలు వరకు నిర్మించిన గ్రావెల్ రోడ్డు



అప్పలరాజుపురంలో మొక్కజొన్నతో దాణా తయారీ చేసే ప్లాంట్



ప్రారంభానికి సిద్ధంగా వాటర్ ట్యాంకు

చీడికాడ: పాడిరైతుల సహకారంతో దినదిన ప్రవర్ధమానం చెందుతూ పాడి పరిశ్రమలో ప్రసిద్ధి గాంచిన విశాఖ డెయిరీ సామాజిక సేవలో చెరగని ముద్ర వేసుకుంటోంది. సంస్థ ఆదాయంలో కొంత మొత్తం సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తోంది. ఇందులో భాగంగా చీడికాడ మండలంలోని ఐదు గ్రామాల్లో శాశ్వత సమస్యలను పరిష్కరించింది. ఈ మేరకు మంచాల, శిరిజాం, బి.సింగవరం, జైతవరం, అప్పలరాజుపురం గ్రామాల్లో రూ.35.58 లక్షలతో పూర్తి చేసిన గ్రావెల్ రోడ్లు, వాటర్ ట్యాంకు, శైలేజ్ ప్లాంట్(దాణా తయారీ), కల్వర్టులు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. వీటిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం ప్రారంభించనున్నారు.

- **జైతవరంలో 6 గ్రావెల్ రోడ్లు, వాటర్ ట్యాంకు**

జైతవరం గ్రామంలో రూ.9.28 లక్షలతో 6 గ్రావెల్ రోడ్లు నిర్మించారు. వీటిలో 1. నాలుగురోడ్ల జంక్షన్ నుంచి బొడ్డువారి కళ్లాల వరకు, 2. ఇదే గ్రామం నుంచి కురచావారి కళ్లాలు మీదుగా జాగరపు కళ్లాలకు, 3. యాదవుల కళ్లాల వరకు, 4. లాలం వారి కళ్లాలకు, 5. కురచా వారి కళ్లాలకు వెళ్లే దారిలో కల్వర్టు, 6. రెడ్డి వారి కళ్లాలకు వరకు గ్రావెల్ రోడ్లు ఉన్నాయి. వీటితోపాటు రూ. 2.50 లక్షలతో బొడ్డకాయల వారి కళ్లాలకు వాటర్ ట్యాంకు నిర్మించారు. పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా చేయనున్నారు.

- **మంచాలలో రూ.3.90 లక్షలతో కల్వర్టు**

నిర్మాణం మంచాలకు చెందిన బోలెం వారి కళ్లాలకు వెళ్లే మార్గంలో కోనాం హైలెవల్ కాలువ ఉంది. ఇందులో దిగి రైతులు కళ్లాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి సూచన మేరకు విశాఖ డెయిరీ నుంచి రూ. 3.90 లక్షలతో కాలువపై కల్వర్టు నిర్మించారు. దీంతో రైతుల సమస్య తీరడంతోపాటు 500 ఎకరాల భూమికి దారి ఏర్పడింది.

- **బి.సింగవరంలో రూ.3.85 లక్షలతో..**

బి.సింగవరంలో విశాఖ డెయిరీ సౌజన్యంతో రూ.3.85 లక్షలతో గ్రామం నుంచి చిన్నారు బంద చెరువు మీదుగా కళ్లాలకు వెళ్లేదారిలో కల్వర్టు నిర్మించారు. ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- **శిరిజాంలో రూ.2.05 లక్షలతో**

శిరిజాంలో రూ.2.05 లక్షలతో గ్రామానికి చెందిన పోతల, బొడ్డు, కన్నూరి వారి కళ్లాలకు వెళ్లే దాలేమ్మ చెరువు అలుగు వద్ద కల్వర్టు నిర్మించారు.

- **అప్పలరాజుపురంలో రూ.14 లక్షలతో దాణా ప్లాంట్**

పాడి రైతుల సౌకర్యార్థం అప్పలరాజుపురంలో రూ.14 లక్షలతో మొక్కజొన్నతో శైలేజ్ గడ్డి తయారీ(దాణా) ప్లాంట్ ఏర్పాటు చేశారు. వేసవిలో పాడిపశువులకు పోషక విలువలతో కూడిన దాణా అందించేందుకు మార్గం సులభమైంది.

రైతుల కష్టాలు తీరాయి..



జైతవరంలో బొడ్డు, కురచా, జాగరపు, లాలం, రెడ్డి, యాదవుల కళ్లాలకు పూర్వం నుంచి రోడ్లు లేవు. గోర్జీల ద్వారా వెళ్లే వారం. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. పంటలను కళ్లాలకు చేర్చేందుకు, ఇంటికి తెచ్చుకునేందుకు మా అవస్థలు వర్ణనాతీతం.. ఈ సమస్యను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సమస్యను విశాఖ డెయిరీ చైర్మన్‌కు వివరించి గ్రావెల్ రోడ్లు నిర్మించారు. వీరికి మా రైతులంతా రుణపడి ఉంటాం.

– కురచా రామకృష్ణ, రైతు, కురచా వారి కళ్లాలు, జైతవరం

మహిళలు స్వశక్తితో ఎదగాలి



శిక్షణ పొందిన మహిళలతో అధికారులు

చోడవరం రూరల్: శిక్షణలో పొందిన నైపుణ్యాన్ని వృత్తిపనిలో అమలు పరచి రాణించాలని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ కుట్టుశిక్షణ మహిళలకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన స్కిల్ సెంటర్‌లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శిక్షణ పొందినవారు స్వశక్తితో ఎదగి, కుటుంబానికి ఆర్థిక చేయూతగా నిలవాలని ఆశించి ప్రభుత్వం స్కిల్ సెంటర్ ద్వారా శిక్షణ అందిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇరుగు పొరుగు వారికి తెలియజేసి వారు సైతం శిక్షణను తీసుకునేలా చేయాలని కోరారు. స్కిల్ హబ్ ఇన్‌చార్జి వి.అప్పలనాయుడు, శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వశక్తితో ఆర్థిక స్వావలంబన పొందిన మహిళలే దేశానికి తోడ్పాటుగా నిలుస్తారన్నారు. ఎన్.ఎస్.ఎస్ పీవోలు రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, అల్యూమిన్నీ కోఆర్డినేటర్ జి.నారాయణమూర్తి, సీనియర్ ఉపన్యాసకులు ఎస్.ఎం.రఫీయుద్దీన్, ఎ.కృష్ణారావు, వి.సత్యవతి, సూర్యవతి పాల్గొన్నారు.

సారా, అక్రమ మద్యంతో ఇద్దరి అరెస్టు



పోలీసులు ధ్వంసం చేస్తున్న బెల్లపు ఊట

బుచ్చియ్యపేట: కొండపాలెం, తురకలపూడి గ్రామాల్లో శనివారం బుచ్చియ్యపేట పోలీసులు విస్తృత దాడులు చేశారు. కొండపాలెంలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశారు. ఒకరిని అరెస్టు చేశారు. తురకలపూడిలో మద్యం విక్రేతను అరెస్టు చేసి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

పేదలకు ఆపద్బాంధవి సీఎం సహాయ నిధి



కర్రి అప్పలనాయుడుకు రూ. 5 లక్షల చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: ఎంతోమంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపద్బాంధవిగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ఎ. కొత్తపల్లికి చెందిన కర్రి అప్పలనాయుడుకు సీఎం సహాయ నిధి నుంచి రూ. 5 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో శనివారం డిప్యూటీ సీఎం అందజేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఇంటింటా పర్యటించిన డిప్యూటీ సీఎం బాధితుడి పరిస్థితిని చూసి చలించిపోయారు. తక్షణమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నగదు మంజూరు చేయించారు. సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎం బూడికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బూడి మాట్లాడుతూ సీఎం సహాయ నిధితో సహాయం అందిస్తున్న మనసున్న మారాజు ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, ఉప సర్పంచ్ పందూరు సరవునాయుడు పాల్గొన్నారు.

‘పది’ భవిష్యత్తుకు తొలిమెట్టు

సీఐ కాంతికుమార్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ కాంతికుమార్

నర్సీపట్నం: పదో తరగతి భవిష్యత్తుకు తొలిమెట్టు అని టౌన్ సీఐ కాంతికుమార్ విద్యార్థులకు సూచించారు. మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి చాలా కీలకమైన దశ అన్నారు. హైస్కూల్ స్థాయిలోనే లక్ష్యాన్ని ఏర్పర్చుకుని సాధన చేయాలన్నారు. ఉపాధ్యాయులు సూచనలు పరిగణలోకి తీసుకుని, పెద్దలను గౌరవిస్తూ చదువుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. స్కూల్ చైర్మన్ బేతిరెడ్డి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు వూడి అప్పారావు, అల్లు అప్పారావు, బాబీ మాస్టర్, ప్రభాకర్, ఫ్రాన్సిస్ సీఐని ఘనంగా సన్మానించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చియ్యపేట: దిబ్బిడి గ్రామ మాజీ ఉప సర్పంచ్ అద్దెపల్లి రామారావుకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామారావును ఇటీవల ధర్మశ్రీ పరామర్శించారు. ఆ సమయంలో బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని జెడ్పీటీసీ దొండా రాంబాబు వివరించారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి లక్ష రూపాయలను రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. సీఎం జగన్‌తోపాటు ధర్మశ్రీకి బాధితుడు ధన్యవాదాలు తెలిపాడు. చోడవరం జెడ్పీటీసీ మారిశెట్టి శ్రీకాంత్, దిబ్బిడి గ్రామ సర్పంచ్ మాణిక్యం (బాషా), సచివాలయ కన్వీనర్ జెర్రిపోతుల రామారావు, చేబోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగులలో పంటల శీతలీకరణ కేంద్రాల పరిశీలన

మాడుగుల రూరల్: ఉద్యానవన శాఖ ద్వారా నిర్మించిన పంట సేకరణ కేంద్రాలు, శీతల గిడ్డంగులతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని శీతల గిడ్డంగులు, పంట సేకరణ కేంద్రాలు జిల్లా పర్యవేక్షణాధికారి, విజయనగరం జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎ.వి.ఎస్.వి. జమదగ్ని తెలిపారు. మాడుగుల మోదమాంబ ఆలయం వద్ద ఉద్యానవన శాఖ, సెర్ప్ సంయుక్తంగా నిర్మించిన పంట సేకరణ కేంద్రాలు, శీతల గిడ్డంగులను ఆయన జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి. ప్రభాకర్‌రావుతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో కింతలి, సాగరం, తదితర చోట్ల వీటిని నిర్మించామన్నారు. రైతులు మిగిలిన గ్రామాల్లో ముందుకు వస్తే వీటి నిర్మాణం చేపడతామన్నారు. మండల ఉద్యానవన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి, వెలుగు ఏపీఎంవో అప్పల నర్సమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ రోలుగుంట, కొత్తకోట జూనియర్ కళాశాలలు, కేజీబీవీలతో పాటు రావికమతం మోడల్ స్కూల్ విద్యార్థులు 161 మందికిగాను 158 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంటు వసుదేవుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేడు పల్స్ పోలియో కార్యక్రమం
- ఐదేళ్లలోపు చిన్నారులకు వేయించాలని అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రావికమతం: కొత్తకోటలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు సిబ్బంది



చౌడువాడలో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న వైద్యాధికారి నిర్మల

నర్సీపట్నం: చిన్నారుల ప్రాణాలకు పోలియో చుక్కలు సంజీవిని వేములపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సుమ పేర్కొన్నారు. శనివారం వేములపూడిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో ఆనంద్, హెచ్.ఎస్. బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలో 3,530 మంది చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీల వైద్యాధికారులు చరిష్మ, సీతారామలక్ష్మి తెలిపారు. ఆటో ద్వారా మైక్ ప్రచారం నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కె.జె.పురం, కింతలి, వద్దాది పీహెచ్‌సీ వైద్యాధికార్లు ప్రసాదు పాత్రుడు, కె.ఎం.నాయుడు, శకుంతల తెలిపారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో 2,515 మంది పిల్లలకు చుక్కలు మందు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 26 పోలియో కేంద్రాలకుగాను 114 మంది సిబ్బందిని, కింతలి పీహెచ్‌సీ పరిధిలో 2,326 మంది పిల్లలకు చుక్కల మందు వేస్తామని, 27 బూత్‌లకుగాను 108 మంది సిబ్బందిని నియమించామన్నారు. శనివారం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

రావికమతం: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీరజని, సురేఖ, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రావికమతం పీహెచ్‌సీ పరిధిలో 3,205 మంది, కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలో 2,075 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆరోగ్య విస్తరణాధికారులు పాతాళ రామారావు, కంచిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కె.కోటపాడు: పల్స్ పోలియో కార్యక్రమంపై శనివారం చౌడువాడలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ పరిధిలో 30 కేంద్రాల ద్వారా 2960 మంది చిన్నారులకు చుక్కల మందు వేయనున్నట్లు వైద్యాధికారి నిర్మల తెలిపారు.

దేవరాపల్లి: పల్స్ పోలియో కార్యక్రమంపై దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో 2,025 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామని వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన తెలిపారు. సీహెచ్‌వో పి. ప్రసాదరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వైద్యాధికారి ప్రసన్న శనివారం తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో 1,838 మంది చిన్నారులకు చుక్కలు మందు వేసేందుకు 29 కేంద్రాలు, మొబైల్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు. గునుపూడి పీహెచ్‌సీ పరిధిలో 1,864 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 24 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కండి

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం సమావేశంలో విప్ ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సంసిద్ధం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణంతోపాటు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో శనివారం మేము సిద్ధం..మా బూత్ సిద్ధం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ మరో 40 రోజుల్లో సార్వత్రిక ఎన్నికల జరుగుతాయన్నారు. ఈ ఎన్నికల్లో చోడవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా తిరిగి ఎగురవేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. ప్రతీ సచివాలయ పరిధిలో గృహసారథులు, బూత్ పరిధిలో బూత్ కమిటీ ప్రతినిధులు, మండల స్థాయి కార్యకర్తలు సమష్టిగా ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బూత్‌స్థాయి కమిటీలు ఓటరల జాబితాను పరిశీలించి, ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే బీఎల్వోలకు చెప్పి సరి చేయాలన్నారు. బోగస్ ఓట్లు ఉంటే వాటిని తొలగించడానికి అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. టీడీపీ గతంలో అనేక బోగస్ ఓటర్లను చేర్పించిందని, వాటిని గుర్తించి తొలగించేందుకు జాబితాను పరిశీలించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రతీ ఇంటికి వెళ్లి తెలియజేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పార్టీ అడ్వయిజర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, పార్టీ సీనియర్ నాయకులు వెంపలి ఆనందీశ్వరరావు, బొడ్డేడ సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి రూ.10 వేల పింఛను అందజేత




కిడ్నీ బాధితుడికి పింఛను అందజేస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: సాగరం కాలనీలో కిడ్నీ బాధితుడు అనుసూరి అప్పలనాయుడుకు నూతనంగా రూ.10 వేల పింఛను మంజూరైంది. ఈ మొత్తాన్ని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ శనివారం అందజేశారు. గతంలో కిడ్నీ బాధితులు డయాలిసిస్ చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడేవారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి ప్రతినెలా వైద్య ఖర్చుల నిమిత్తం పింఛను అందజేసి ఆదుకుంటున్నారని తెలిపారు. సర్పంచ్ కోట్ని జయమ్మ సన్యాసినాయుడు, ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం జగ్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాము వెంకటరావు పాల్గొన్నారు.

రేపు వడ్డాది వెంకన్న కొబ్బరి చెక్కల వేలం

బుచ్చియ్యపేట: వడ్డాది వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు సందర్భంగా భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలకు, తలనీలాలకు ఈ నెల 4న బహిరంగ వేలం వేయనున్నారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే 151వ వార్షికోత్సవాల్లో కొబ్బరి చెక్కలు తీసుకోడానికి, ఈ నెల 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు తలనీలాలు పోగు చేసుకోవడానికి వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో శర్మ శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులు



ఎ.శరభవరం పొలాల్లో మినప పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నాతవరం: తిరుపతి మినుము 104 రకంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు శైలజా కుర్రా తెలిపారు. ఎం.బి.పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరంలో మినప పంటను శనివారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. వేప నూనె ఒకసారి పిచికారీ చేస్తే పేల్బుపురుగును నివారించవచ్చన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సూచనల పాటిస్తే ఎకరాకు 294 కిలోలపైనే దిగుబడులు సాధించవచ్చున్నారు. వ్యవసాయాధికారి శైలజా మాట్లాడుతూ రైతులకు కావలసిన సామగ్రిని ఆర్బీకేల ద్వారా సకాలంలో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, సేద్య శాస్త్రవేత్త ప్రసాదరావు, సచివాలయ వ్యవసాయాధికారి చెక్కా నవ్య పాల్గొన్నారు.

హత్యాయత్న ఘటనపై డీఎస్పీ విచారణ

మాకవరపాలెం: హత్యాయత్న ఘటనపై నర్సీపట్నం డీఎస్పీ మోహన్ విచారణ చేపట్టారు. మండలంలోని రాచపల్లిలో గురువారం రాత్రి నిద్రిస్తున్న తుంగ్లాల విజయపై తన భర్త రమణ పెట్రోల్ పోసి హత్యకు ప్రయత్నించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు శనివారం రాచపల్లిలో విజయ ఇంటిని డీఎస్పీ పరిశీలించారు. పెట్రోల్ తీసుకువచ్చిన బాటిల్, దాడిలో కాలిన దుప్పట్లు, చాపలను పరిశీలించారు. అనంతరం నర్సీపట్నం రూరల్ సీఐ హరి, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.